దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూరవిద్య విధానంలో పీజీకోర్సులతోపాటు పీజీ డిప్లొమా కోర్సులు చేయాలనుకునేవారు దరఖాస్తులు చేసుకోవాలని డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఎంబీఏ,ఎంఏ, ఎంకామ్, ఎంఎస్‌సీ,పీజీ డిప్లొమా కోర్సులు మ్యాథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్‌టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బయోఇన్ఫర్మెటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఓయూసీడీఈ.నెట్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



అన్నం తినాలంటే కిలో మీటర్ నడవాల్సిందే!

- మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం
- ఎండలో కాలినడకన వచ్చి వసతిగృహంలో భోజనం

.... వివరాలు 8లో



• జిల్లా విద్యుత్‌శాఖకార్యాలయం

పవర్‌ఫుల్ డిమాండ్!

- జిల్లాలో పెరిగిన విద్యుత్ వినియోగం • రోజుకు 5.8 మిలియన్ యూనిట్ల ఖర్చు
- యాసంగిలో పెద్దఎత్తున్న పంటల సేద్యం • అధికమవుతున్న వ్యవసాయ బోర్ల వాడకం
- జిల్లాలో 2.61 లక్షల ఎకరాలలో వరి సాగు • రెండు లక్షల వ్యవసాయ బోరు కనెక్షన్లు
- వ్యవసాయానికే అత్యధికంగా వినియోగం అవుతున్న విద్యుత్
- గృహ, కమర్షియల్ అవసరాలకు సైతం పెరుగుతున్న విద్యుత్ వినియోగం

కామారెడ్డి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయానికి పెట్టిన పేరు. జిల్లాలో విస్తరంగా వరి పంటను రైతులు సాగుచేస్తుంటారు. అయితే గత వానకాలంలో విస్తరంగా వర్షాలు కురువడంతో చెరువులు, ప్రాజెక్టులు నిండుకున్నాయి. భూగర్భజలాలు సైతం పెరిగాయి. రైతులు ఈయాసంగిలో లక్షల ఎకరాలలోనే వరి నాట్లు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఉచితంగా 24 గంటల విద్యుత్‌ను అందిస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి విద్యుత్ వినియోగం పెరుగుతోంది. జిల్లాలో ఇటీవల కాలంలో ప్రతీరోజు 5.8 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా 2.8 మిలియన్ల యూనిట్లు మాత్రమే ప్రతీ రోజు వినియోగమయ్యేవి. అయితే ఎండలు ముదురుతుండడంతో వ్యవసాయానికి వినియోగం పెరగడంతో విద్యుత్ ఖర్చు ఎక్కువ అవుతున్నట్లు సంబంధిత శాఖ అంచనాలు వేస్తోంది. ఈ విద్యుత్ వినియోగం వేసవి చివరి వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



• లక్షల ఎకరాలలో వరి నాట్లు

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో లక్షల ఎకరాలలోనే రైతులు వరి నాట్లు వేశారు. భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో బోర్ బావుల కిందనే వేల ఎకరాలలో పంటలు సాగుచేస్తున్నారు. ఇక నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాల ప్రాజెక్టల ఆయాకట్టు క్రింద లక్షల ఎకరాలలోనే పంటలు సాగుచేశారు. జిల్లాలో ప్రాజెక్టలతో కాలువలద్వారానే కాకుండా లక్షల ఎకరాలలో బోర్ బావుల క్రిందనే రైతులు పంటలను సాగుచేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 3.85 లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగు కాగా, ఇందులో 2.61 లక్షల ఎకరాలలో వరి పంట సాగుచేస్తున్నారంటే రైతులు వరి నాట్లు ఏ స్థాయిలో వేశారో అర్థం చేసుకోవచ్చు. భూ గర్భజలాలు ఎక్కువగా ఉండడం, ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో బోర్‌బావుల వద్ద రైతులు వరిపంటను విస్తరంగా సాగుచేయడంతో వ్యవసాయానికి విద్యుత్ వినియోగం పెరిగింది. విద్యుత్‌శాఖ అధికారులు సైతం వ్యవసాయానికే ఎక్కువ మొత్తంలో విద్యుత్ వినియోగం అవుతున్నట్లు చెబుతున్నారు.

• పెరిగిన విద్యుత్ వినియోగం

వేసవి ప్రారంభం కావడం, ఎండలు సైతం ముదురుతుండడంతో రోజురోజుకు విద్యుత్ వినియోగం సైతం పెరుగుతోంది. వ్యవసాయానికే కాకుండా గృహఅవసరాలు, పరిశ్రమలు, కమర్షియల్ లాంటి క్యాటగిరిలకు సైతం విద్యుత్‌ఖర్చు ఎక్కువగా అవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రతీరోజు సుమారు 2.8 మిలియన్‌యూనిట్ల విద్యుత్ వినియోగం ఉండేది. ప్రస్తుతం 5.8మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతున్నట్లు ఆ శాఖాధికారుల లెక్కలు చెబుతున్నాయి.

• జిల్లాలో 95,901 వ్యవసాయ బోర్లు

జిల్లాలో 95,901 వ్యవసాయ బోరు కనెక్షన్‌లున్నాయి. ఇక్కడ ప్రతీరోజు యావరేజ్‌గా 2.8 మిలియన్ యూనిట్ల విద్యుత్‌వినియోగం అవుతుండగా ప్రస్తుతం 5.8మిలియన్ యూనిట్ల వినియోగం ఖర్చు అవుతుందని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయానికి కరెంట్ ఉచితంగా ఉండడంతో ప్రతీఏటా ఫిబ్రవరి రెండోవారం నుంచి ఏప్రిల్ చివరివరకు పంటల సాగు ఉంటుండడంతో విద్యుత్ వినియోగం పెరుగుతుంది. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్‌ను సరాఫరా చేస్తున్నారు.

• పగటి పూట అధికం

వ్యవసాయానికి ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్‌ను సరాఫరా చేస్తుండడంతో పగటిపూట విద్యుత్ వినియోగం పెరుగుతుంది. గతంలో ఫేజ్‌ల వారిగా సరాఫరా చేసిన సమయంలో రాత్రిపూట ఎక్కువగా వాడకం ఉండేది. వ్యవసాయానికి ఇప్పటి నుంచి మార్చి నెలకరు కీలకం కావడంతో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని, ఆ శాఖ అధికారులు అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ముందుజాగ్రత్తగా గ్రామాల వారిగా ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలిస్తున్నారు. జిల్లాలోని 132 సబ్‌స్టేషన్‌ల పరిధిలో 29,470 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. కరెంట్ వినియోగం (తరువాయి 8వ పేజీలో..)



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

ఒడిస్సా టూ నాందేడ్ గంజాయి రవాణా

- 90 కిలోల గంజాయి పట్టివేత • ఇద్దరి అరెస్టు

బాన్సువాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా టు నాందేడ్ వయా ఆంధ్రప్రదేశ్, కర్నాటక మీదుగా భారీగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న 90.830 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. నిజాంసాగర్ మండలం గుండా గంజాయి అక్రమంగా రవాణా అవుతుందని తమకు నమ్మదగిన సమాచారం రాగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున నుంచి నిఘా పెట్టగా ఉదయం 5గంటల ప్రాంతంలో వాహనాల తనిఖీ నిర్వహించారని, ఈ తనిఖీల్లో ఒక వాహనం పట్టుకుని తనిఖీ చేయగా 90.830కిలోల గంజాయి లభించిందని తెలిపారు. నల్గొండ జిల్లా అంబాల గ్రామానికి చెందిన తిరుపతి, గాంధారి మండలం జెమినీ సత్యం, శ్రీను, శంకర్, వినోద్ గంజాయిని స్కార్పియో వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. తమ సిబ్బంది స్కార్పియో వాహనంలో ఉన్న తిరుపతి, సత్యంలను పట్టుకోగా మిగతా నిందితులు ముగ్గురు సత్యం, శ్రీను, శంకర్ ఎక్సైజ్ అధికారుల వాహనాన్ని ఢీకొట్టి పరారైనట్లు తెలిపారు. బహిరంగమార్కెట్లో ఈ గంజాయి విలువ 22.50 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఒక ద్విచక్ర వాహనం, స్కార్పియో సీజ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడిన నిందితులపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి నిందితులను పట్టుకునేందుకు కృషిచేసిన సిబ్బంది స్వప్న, సుందల్‌సింగ్, తేజస్విని, హనుమంతరావ్, డిసిబి నాయక్, రామ్ కుమార్, నారాయణరెడ్డి, భూమన్న, శరత్, విష్ణు, మారుతి, ఆశన్న, భోజన్న, శ్యాంసుందర్, సందీప్‌లను డిప్యూటీ కమిషనర్ అభినందించారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి: ఎస్ఎఫ్ఐ

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినికాంత్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పీజేఆర్ డిగ్రీకళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ 5వ మహాసభలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అరుణ్ జెండా ఆవిష్కరించి అమరులకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే పద్ధతిలో వ్యవహరిస్తోందని అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రూ.8వేల కోట్లకు పైగా రాష్ట్రప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, కొత్తనర్సింలు, అజయ్, రాహుల్, నితిన్, మణికంఠ, నవీన్, విలాస్, ప్రశాంత్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలను

నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎల్లారెడ్డి, బాన్సువాడ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు పంచాయతీ ఎన్నికల మొదటి దశ నిర్వహణ తీరుతెన్నులపై అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చట్టబద్ధతతో కూడిన ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాల్సి ఉంటుందని, ఎన్నికల నియమనిబంధనల మేరకు స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యమవుతుందని అన్నారు. శిక్షణ తరగతుల్లో వివరించిన ప్రతీ అంశాలను శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలని, ఎన్నికల సంఘం ద్వారా సరఫరా చేయబడిన హ్యాండ్ బుక్‌ను తప్పనిసరిగా చదువుకుని ఎన్నికల మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను అడిగి నివృత్తిచేసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూట్నిని, ఉపసంహరణ ప్రక్రియలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. నామినేషన్లు, స్క్రూట్నీని అప్పీల్ వంటి వాటికోసం సమయపాలనను పక్కాగా పాటించాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లను అక్షరమాల క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని, ఓటరు జాబితాలోని అభ్యర్థి పేరును అక్షరక్రమం కోసం పరిగణలోకి తీసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్‌లు సమర్పిస్తే అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి.. ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి... అందుకు కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని చెప్పారు. వెంటవెంటనే స్కాన్‌చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎలాంటి ఆక్షేపణలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆర్‌డీఓ ప్రభాకర్, బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, డీపీఓ శ్రీనివాస్‌రావు, డీఈవో రాజు, ట్రైనర్స్ నాగరాజు, సురేందర్, శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

వైభవంగా రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణం

- భారీగా హాజరైన భక్తులు

భిక్కనూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతర కార్యక్రమం కొనసాగుతోంది. వార్షికోవత్సంలో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసి ముత్యాలపందిరిలో శ్రీ రేణుకాఎల్లమ్మ- జమదగ్నిల కల్యాణాన్ని వేదబ్రహ్మణుల మంత్రోచ్చరణల నడమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. జాతరలో భాగంగా ఆలయ ప్రాంగణంలో పలు దుకాణాలు వెలిశాయి.

మంజీరా కేంద్రంగా

ఇసుక అక్రమ రవాణా!

- అభివృద్ధి పేరిట అడ్డగోలుగా వే బిల్లులు • ప్రైవేట్ నిర్మాణాలకు తరలింపు • మితిమీరిపోతున్న ఇసుక మాఫియా ఆగడాలు • చేతులు కట్టుకున్న అధికార యంత్రాంగం
- నేతల ఒత్తిళ్లకు అధికారులు గజగజ • ఇకనైనా అక్రమ ఇసుక రవాణాకు కళ్లెం పడేనా?

బాన్సువాడ, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ శివారులోని మంజీరా ఇసుక మాఫియాకు అక్రమ రవాణా అడ్డాగా మారింది. 'తవ్వకున్నోళ్లకు తవ్వుకున్నంత' అన్న చందంగా మంజీరా నదిలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గత కొన్నాళ్ల క్రితం వరకు రాష్ట్ర స్థాయిలో ఉన్న ఇసుక మాఫియా మంజీరాను కొళ్ల గొడితే ఇప్పుడు స్థానిక మినీ మాఫియా ఇసుకను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. ప్రతీ రోజు బీర్కూర్, కిష్టాపూర్, చించోల్లి, బరంగేడ్గి కేంద్రంగా వందలాది ట్రాక్టర్‌లలో, టిప్పర్‌లలో ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట వే బిల్లులు తీసుకుని ప్రైవేట్ నిర్మాణాలకు జోరుగా కొనసాగుతున్నాయి. ఆ పనులకు అవసరమయ్యే ఇసుకను మంజీరాలో తవ్వుకునేందుకు అనుమతులు ఇస్తున్నారు. దీంతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అభివృద్ధి పనుల వద్దకు చేరాల్సిన ఇసుక పక్కదారి పడుతోంది. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమానులు ప్రైవేటు వ్యక్తులకు ఇసుకను విక్రయిస్తు రెండు చేతుల సంపాదించుకుంటున్నారు. ఇసుక అనుమతుల్లో 50శాతం అభివృద్ధి పనులు జరుగుతున్న చోటికి చేరుతుండగా మరో 50శాతం దారి మర్లుతున్నాయి. బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ వండలాల్లో పెద్దపెద్ద నిర్మాణాలకు భారీగా (తరువాయి 8వ పేజీలో..)



బాన్సువాడలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

ఇసుక అక్రమ రవాణాపై నిఘా కరువు

ఇసుక అనుమతులు పొందిన అనంతరం ఇసుక ప్రభుత్వ పనులు జరిగే చోటికే వెళ్తోందా లేదా అనే దానిపై అధికారుల నిఘా కరువైంది. బీర్కూర్ మంజీరా నుంచి బయలుదేరిన ట్రాక్టర్‌లు అనుమతులు ఉన్న చోటికి చేరుతున్నాయా అనే దానిపై ఎలాంటి నిఘా లేదు. దీంతో అక్రమార్కులు ఇసుకను దారి మళ్లిస్తున్నారు. ప్రతీ రోజు 30, 40 ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా దారి మళ్లుతోందని సమాచారం. ఇందులో అధికారులకు సైతం వాటాలు ఉన్నట్లు పుకార్లు, షికార్లు చేస్తూన్నాయి. అధికారులు నిఘాను పెంచాల్సిన అనవరం ఎంతైనా ఉంది.

ఇసుక అక్రమ రవాణా దందా యథేచ్ఛగా సాగుతోంది. పట్టించుకోవాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులకు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. నేతల ఒత్తిళ్లకు అధికారులు జీ హుజూర్ అంటూ గజ గజ వణికిపోతున్నారు. అక్రమంగా ఇసుక కళ్లముందు నుంచే పోతున్న దాన్ని అడ్డుకునే ధైర్యం చేయలేక చేతులు కట్టుకుని ఉండిపోతున్నారు. ఎందుకొచ్చిన గొడవ అంటు అధికారులు ఇసుక అక్రమరవాణాపై దృష్టిపెట్టకుండా వదిలేస్తున్నారు. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుంటే అధికారులు పట్టుకోగానే, వారిని విడిచి పెట్టాలంటూ నేతల నుంచి ఫోన్లు వస్తున్నాయని కొంతమంది సిబ్బంది పేర్కొంటున్నారు.

అభివృద్ధి పేరిట ఇసుక దందా

బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో ప్రభుత్వ పనులు

ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం పడేనా?

ప్రైవేటు వ్యక్తులు మరుగుదొడ్లు, ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ఇసుక అనుమతుల కోసం అధికారులను సంప్రదిస్తే సవాలక్ష ప్రశ్నలు వేసి ఇవ్వలేమని తేల్చి చెప్పేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా అభివృద్ధి పనుల పేరిట జోరుగా కొనసాగుతోంది. ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు చేష్టాలుడిగి చూస్తున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమ దందాపై జిల్లా ఉన్నత అధికారులు దృష్టి సారించి అక్రమ రవాణాకు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.



పల్లెల్లో మొదలైన రాజకీయ సందడి

7

- 'స్థానిక' ఎన్నికలకు సిద్ధమవుతున్న నాయకులు
- ఓటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నంలో నేతలు

ఫటా..ఫట్...

పేకాట ఆడితే కఠిన చర్యలు

● లావణ్య ఎస్సై నసురుల్లాబాద్



ఆంధ్రజ్యోతి: మండలంలోని ఆయా గ్రామాల్లో విచ్చలవిడిగా పేకాట శిబిరాలు నడుస్తున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై మీ కామెంట్..?

ఎస్సై: పేకాటశిబిరాలు నిర్వహించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. ఎవరైనా గ్రామాల్లో పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలి.

ఆంధ్రజ్యోతి: మండలంలో దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: మండలంలోని ఆయా గ్రామాల్లో రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: రోడ్డు ప్రమాదాలు జరగకుండా బాన్సువాడ నిజామాబాద్ ప్రధాన రహదారిపై సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పేకాటపై ఎస్పీ, పోలీసు సిబ్బందిపై సీరియస్ అయినట్టు సమాచారంలో నిజం ఉందా లేదా?

ఎస్సై: పేకాటపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంతో ఎస్పీ పేకాట ఆడే వారిపై ఉక్కుపాదం మోపాలని, అదే విధంగా పోలీసు సిబ్బంది తీరుపై ఆరాతీశారు.

● (ఆంధ్రజ్యోతి,నసురుల్లాబాద్)

నందిపేటలో బస్ డిపో ఏర్పాటు చేయాలని వినతి



ఆర్ఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యమ కమిటీ సభ్యులు

నందిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్టీసీ బస్ డిపో నిర్మించాలని కోరుతూ మంగళవారం నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జ్యోత్స్నకు నందిపేట బస్ డిపో ఏర్పాటు ఉద్యమ కమిటీ సభ్యులు సంబారు గిరిధర్, సాయికిరణ్ వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో బస్ డిపో నిర్మిస్తామంటే విరాళాల ద్వారా ఐదు ఎకరాలు కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించామని, దాని చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి వదిలేశారని పేర్కొన్నారు. దశాబ్దాలు గడుస్తున్న ఇప్పటికి ఎటు వంటి నిర్మాణం జరగలేదని, గత ప్రభుత్వాలు రాస్తారోకోలు, ధర్నా లు, ఆమరణ నిరాహర దీక్షలు చేసినా స్పందించలేదని వినతి పత్రం లో పేర్కొన్నారు. గతంలో రూట్లు లేవని సాకులు చెప్పారని, ప్రస్తుతం గోదావరి నదిమీద బ్రిడ్జి నిర్మించాని, దీంతో కనెక్టివిటి పెద్ద మొత్తంలో పెరిగిందని ఆర్ఎం జ్యోత్స్న, నిజామాబాద్ డిపో-1 మేనేజర్ ఆనంద్‌కు తెలిపారు. అనంతరం ఆర్మూర్ ఏసీపీ వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఆర్ఎస్ఎస్ స్వయం సేవకుడిని అయినందుకు గర్విస్తున్నా

● త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి



కందకుర్తి గ్రామంలో నిర్మిస్తున్న కేశవ స్మృతి మందిరాన్ని పరిశీలిస్తున్న త్రిపుర గవర్నర్

రెంజల్,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ స్వయం సేవకుడి నుండి ప్రారంభమైన ప్రస్థానం నేడు త్రిపుర గవర్నర్‌గా ఎన్నిక కావడానికి కారణం ఆర్ఎస్ఎస్ శాఖ సంఘమేనని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కందకుర్తి గ్రామంలో 40కోట్లతో నిర్మిస్తున్న కేశవ స్మృతి కేంద్రం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రాన్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. హెడ్గేవర్ పూర్వీకుల గ్రామమైన కందకుర్తిలో కేశవ స్మృతి మందిరాన్ని నిర్మించడం యావత్తు దేశానికి గర్వకారణమని ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవర్ పూర్వీకుల గ్రామమైన కందకుర్తి స్మృతి మందిర నిర్మాణ పనులను పరిశీలించడం జరిగిందని ఆయన అన్నారు. తాను ఆర్ఎస్ఎస్ నుండి క్రమశిక్షణతో కలిగి గుణాన్ని అలవర్చుకుని రాజకీయంగా, గవర్నర్‌గా పదవి నిర్వహిస్తున్నానంటే దానికి ఆర్ఎస్ఎస్ సంఘ్ వల్లనే ఈ హోదాలో ఉన్నానని అన్నారు. త్రిపుర గవర్నర్‌ను అయిన కందకుర్తికి స్వయం సేవక్‌గానే వచ్చానని, కందకుర్తిని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ పెద్ద గొప్ప సంస్థగా ఏర్పడిందని, ఆర్ఎస్ఎస్ ఏర్పాటుకు కందకుర్తి గ్రామం పురుడు పోసుకుందని, ఇంతటి మహోన్నతమైన కందకుర్తితో త్రివేణి సంగమ క్షేత్రం ఉండడం దేశానికి గర్వకారణం అన్నారు. భారత దేశ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రధాని మోడీ కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు దేశం, ధర్మం, గోమాత రక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కందకుర్తి క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ప్రతి ఒక్క స్వయం సేవకుడు గర్వించదగ్గ క్షేత్రం కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రమేనని ఈ పవిత్ర గడ్డను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల్సిన ప్రదేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్ రెడ్డి, కేశవ సేవా సమితి అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు గోపికృష్ణ, మాజీ ఉప సర్పంచ్ యోగేష్, బీజేపీ జిల్లా నాయకులు సుధాకర్ చారి, అంకు మహేష్, కృష్ణా రెడ్డి, మల్లికార్జున్, రమేష్, గోవింద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని మంగళవారం మనోహరాబాద్ జెఎంకెపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమ డైరెక్టర్లు కలిశారు. అనంతరం పసుపు పరిశ్రమల తయారు చేసిన పసుపు పౌడర్‌ను త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి అందజేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, జాతీయ పసుపుబోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మొట్టమొదట మనోహరాబాద్‌లో టర్మరిక్ క్లస్టర్ ద్వారా మేలుకొల్పి ఇందులో 600మంది రైతులతో ఐదు గ్రామాల రైతులు కలిసి ఈ పరిశ్రమను ఏర్పాటు చేసుకొని నిల్వ ఆధారిత పసుపు ఉత్పత్తుల పౌడర్‌ను తయారు చేసి మార్కెటింగ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఎంహెచ్‌పీఎం ద్వారా నిధులు మంజూరు చేయించడం జరిగిందని త్రిపుర గవర్నర్‌కు పసుపు రైతుల ఉత్పత్తిదారుల పరిశ్రమ డైరెక్టర్ పి.తిరుపతిరెడ్డి సూచించారు. దీనికి గవర్నర్ స్పందిస్తూ త్రిపుర రాష్ట్రంలో గవర్నర్ పని చేస్తున్నాను అక్కడ కూడా పసుపు పండిస్తారని త్రిపుర రాష్ట్రానికి మనోహరాబాద్ పసుపు పరిశ్రమ ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ త్రిపుర రాష్ట్రానికి వచ్చి పరిశీలించాల్సిందిగా గవర్నర్ చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం పరిశ్రమ డైరెక్టర్లు పి.తిరుపతిరెడ్డి, సభ్యులు శిరీష, లింగం, రైతులు పాల్గొన్నారు.

నవీపేట: త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డిని మండల బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. రెంజల్ మండలం కందకుర్తి పర్యటనకు వచ్చిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, కోరే గంగాధర్, తదితరులున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



జైతాపూర్‌లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అంజయ్య

ఎడపల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామ శివారులో గల పాపారావు వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూరు వారి ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయంపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని రైతులు, వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ అంజయ్య మాట్లాడుతూ రైతులు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్నారని, వాటి వల్ల లాభం తక్కువగా నష్టం ఎక్కువగా వస్తుందని ఆయన అన్నారు. రైతులకు పంటను ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడుకోవడానికి, రసాయన ఎరువుల నుండి నష్ట నివారణకు సేంద్రీయ వ్యవసాయం మేలైందని రైతులు సేంద్రీయ వ్యవసాయంపై మక్కువ చూపాలని ఆయన సూచించారు. జిల్లాలో అనేక మంది రైతులు సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో దిగుబడి తక్కువగా వస్తుందని సేంద్రీయ వ్యవసాయంపై మక్కువ చూపడంలేదని, రెండు మూడు పర్యాయాలు నష్ట నివారణను తట్టుకుని మెలకువలు పాటిస్తే లాభాలు గడించవచ్చన్నారు. సేంద్రీయ వ్యవసాయంపై ప్రభుత్వం చేసే ప్రచారం కన్నా రైతులు రైతులకు చేసే ప్రచారం మేలని సేంద్రీ వ్యవసాయం చేస్తున్న రైతులు ఇతర రైతులకు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను వివరించి సేంద్రీయ వ్యవసాయంను అభివృద్ధి చేయాలన్నారు. సేంద్రీయ వ్యవసాయం, వ్యసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు రైతులు వివరించి, ప్రభుత్వం నుండి ప్రోత్సాహకాలు అందిస్తే రైతు ఇంకా ముందుకు సాగుతాడని, మరింత మంది రైతులు సేంద్రీయ వ్యసాయం చేయడానికి ముందుకు వస్తారని వారు వివరించారు. రైతులకు అధిక దిగుడడి వచ్చే వంగడాలను కృషి విజ్ఞాన కేంద్రం వారు సృష్టించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు స్వప్న, వెంకట్ రాజ్ కుమార్, రైతులు జనార్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చెఱుకు ఉత్పత్తి దారుల సంఘం మాజీ అధ్యక్షులు పాండు రంగారావు, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ముదిరాజ్ సంఘ సభ్యులు



రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న ముదిరాజ్ పెద్ద సంఘ సభ్యులు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని మంగళవారం జక్రాన్‌పల్లి ముదిరాజ్ పెద్ద సంఘం సభ్యులు కలిశారు. అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డిని శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జక్రాన్‌పల్లిలో ఉన్న సమస్యలు భూమి సమస్యలను పరిష్కరించాలని నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్ ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ పెద్ద సంఘం సభ్యులు జక్కం చిన్నారెడ్డి, డిష్‌రాజు, సుధీర్, పెద్దసాయిలు, మహేందర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని మున్సిపల్ మాజీసర్పంచ్ ఎం.చిన్నసాయిరెడ్డి తండ్రి ముస్కు బొర్రన్న గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మంగళవారం సాయంత్రం మాజీడీసీఎంఎస్‌చైర్మన్ ఎం.సాయిరెడ్డిని, తాజా మాజీసర్పంచ్ ఎం.చిన్నసాయిరెడ్డిని కుటుంబసభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు కాట్‌పల్లి నర్సారెడ్డి, జితేందర్‌నాయక్, ఉన్నారు.

నేటి నుంచి సిర్పూర్ మల్లన్న జాతర



సిర్పూర్‌లో అలంకరించిన మల్లన్న స్వామి ఆలయం

డొంకేశ్వర్, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి):డొంకేశ్వర్ మండలం సిర్పూర్ గ్రామంలో మల్లన్న ఆలయ జాతర ఉత్సవాలు బుధవారం నుంచి 16వ తేదీ వరకు కొనసాగుతాయని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలకు ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. బుధవారం స్వామివారి ఊరేగింపు, కల్యాణం, అన్నదానం, 13న అమ్మవారి బోనాలు, చల్లకుండలు, 14న స్వామి వారికి నైవేద్యాలు, 15న ఆయాగ్రామాల ప్రజ లు నైవేద్యాలు సమర్పిస్తారని, 16న అగ్నిగుండం, స్వామివారి నాగవెల్లి వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి దర్శించుకోవాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

పసుపుబోర్డు జాతీయ అధ్యక్షుడికి సన్మానం



పసుపుబోర్డు జాతీయ అధ్యక్షుడు పల్లెగంగారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌రూరల్,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): జాతీయ పసుపుబోర్డు అధ్యక్షుడిగా నియమితులై బాధ్యతలు చేపట్టిన పల్లె గంగారెడ్డిని మంగళవారం మండలంలోని అంకాపూర్ గ్రామంలో బీజేపీ సీనియర్ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ మాట్లాడుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు పసుపుబోర్డు మంజూరు చేయించారని కొనియాడారు. అదే విధంగా జాతీయ పసుపుబోర్డు ఛైర్మన్‌గా ఆర్మూర్ ప్రాంత రైతు బిడ్డ పల్లె గంగారెడ్డిని నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుస్తపురం ముత్తెన్న, బింగి పెంటయ్య, దార్ల చిన్న ముత్తెన్న, నవీన్‌పటేల్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి డయల్ 100 సేవలను దుర్వినియోగం చేసిన ఒకరికి జైలు

రుద్రూరు,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో డయల్ 100కి కాల్ చేసిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు రుద్రూర్ ఎస్ఐ సాయన్న పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన హబీబ్ ఖాన్(37)అను అతను మద్యం మత్తులో అనవసరంగా డయల్ 100కి కాల్ చేసి దుర్వినియోగం చేశాడు. అలా పలుమార్లు డయల్ 100కి అనవసరంగా కాల్ చేసినందుకు మంగళవారం అతనిపైన కేసు నమోదు చేసి గౌరవ సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఎదుట హాజరుపరిచారు. న్యాయాధికారి రెండు రోజులు జైలుశిక్ష విధించినట్లు తీర్పు వెల్లడించారు.

మట్కారాయుళ్లకు శిక్ష, జరిమానా

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మట్కా ఆడుతున్న పలువురిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ శిక్ష, జరిమానాను విధించినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలోని ఆదర్శ నగర్‌లో జనవరి 20న తెలిసిన సమాచారం మేరకు మట్కా ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా రూ.28వేల నగదు, మూడు ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారణ పూర్తి చేసి మంగళవారం కోర్టులు హాజరుపర్చినట్టు తెలిపారు. దీంతో సెకండ్ క్లాస్ న్యాయాధికారి గట్టు గంగాధర్ గోవర్ధన్ ఇంట్లో మట్కా ఆడి పించినందుకు గోవర్ధన్‌కు ఏడు రోజుల సాధారణ జైలు శిక్షణతో పాటు రూ.2వేల జరిమానా విధించారు. మిగిలిన ఐదుగురి నర్సయ్య, శేఖర్, రాజారాం, మహేష్, షేక్ వాలీలకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

కల్దుర్కిలో చోరీ

బోధన్‌రూరల్,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంటికి పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. చోరీ ఘటనలో 5తులాల బంగారంతో పాటు రెండున్నర లక్షల నగదును దొంగలించబడ్డాయని ఆయన తెలిపారు. ఇంటి యాజమాని లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. గ్రామంలోని సీసీ కెమెరాల ద్వారా దొంగలను పట్టుకుని త్వరలోనే రికవరీ చేస్తామన్నారు.ఘటన స్థలాన్ని పరిశీలించారు.

కంట్లో కారం కొట్టి చోరీకి యత్నించిన మహిళ

● దేహశుద్ధి చేసిన స్థానికులు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో చీరల వ్యాపారం చేసే స్వప్న ఇంటికి బుర్కలో ఒక మహిళ వచ్చి చీరలు చూపించామని కోరి సెలక్షన్ చేసే చీర ప్యాక్ చేయమని చెప్పి మహిళ తన వెంట తెచ్చుకున్న కారంపొడిని స్వప్న కళ్లలో చల్లి 40వేల రూపాయలతో పాటు స్వప్న మెడలోని బంగారు పుస్తెల తాడుకు లాక్కొని వెళ్లే ప్రయత్నం చేసిందని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. వెంటనే స్వప్న కేకలు వేయడంతో స్థానికులు గమనించి దొంగతనానికి యత్నించిన మహిళను వెంబడించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారని తెలిపారు. స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. కళ్లలో కారం కొట్టి 40వేలు, బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లడంతో పాటు చాకుతో బెదిరించిందని ఈ సందర్భంగా ఆమె వివరించారు. బుర్కలో వచ్చిన మహిళను విచారించగా తన పేరు శోభ అని తెలిపిందన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో కొండపై కొలువుదీరిన శ్రీ ఆనందగిరి లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణోత్సవం అంగరంగా వైభవంగా కన్నుల పండగగా జరిగింది. అర్చకులు దండల మోహన్‌శర్మ ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలు నిర్వహించారు. స్వామివారి కళ్యాణోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

రంగరాజన్‌పై దాడి కేసులో పోలీసు అదుపులో బోధన్ వాసి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన ఘటనలో బోధన్‌కు చెందిన సాయినాథ్ అనే వ్యక్తిని మొయినాబాద్ పోలీసులు సోమవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ రామరాజ్యం ఆర్మీ జిల్లా అధ్యక్షుడిగా మూడేళ్లుగా పని చేస్తున్నాడని, ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో మొయినాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకుని వెళ్లారని బోధన్ పోలీసులు తెలిపారు. అర్చకుడుపై ఘటన రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బోధన్ వాసి పాత్ర వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

రూ.2లక్షల ఎల్‌వోసీ అందజేత

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన హన్మాండ్లు అనే వ్యక్తి మోకాలి నొప్పితో నడవలేక బాధపడుతున్నారు. చికిత్స కోసం డబ్బులు లేకపోవడంతో స్థానిక తెరాస నాయకులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా హైదరా బాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మోకాలి శస్త్రచికిత్స చేయించుకోవడానికి రూ.2 లక్షల ఎల్‌వోసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శాఖాపూర్‌లో సైబర్ మోసం

నవీపేట,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని శాఖాపూర్‌కు చెందిన కాడ మారుతి ఫేస్ బుక్ యాప్‌లో ఆల్టో కారు అమ్మకానికి కలదని మెసెజ్ రావడంతో అతడు డబ్బులు చెల్లించి మోసపోవడంతో బాధితుడు సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. గత నెల 25న తన ఫోన్‌లోని ఫేస్‌బుక్ యాప్‌లో ఆల్టో కారు అమ్మకానికి ఉందని అడ్వటైజ్‌మెంట్ వచ్చిందని, దానిని క్లిక్ చేయగా గుర్తు తెలియని నెంబర్ నుండి ఫోన్ వచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అవతలి వ్యక్తి తాను ఆర్మీ ఎంప్లాయినని తన కారును అమ్మాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా ఆర్మీ ఆఫీస్ ఫోటోలు, ఐడెంటి కార్డును పంపి నమ్మించాడు. దీంతో మారుతి కారు బుకింగ్ కొరకు అదే రోజు 22వేల రూపాయల పంపగా తర్వాత రోజులలో మరికొన్ని సార్లు డబ్బులు పంపించాడు. అనంతరం 26వ తేదీ నాడు 18వేలు, 27వ తేదీ నాడు 20వేలు పంపించాడు. అవతలి వైపు నుండి ఇంకా డబ్బులు పంపాలని లేకపోతే కారు రాదని పేర్కొనడంతో తాను మోసపోయ్యాయని గ్రహించి బాధితుడు సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్: వివరించారు.

నందిపేట బీజేపీ మండల అధ్యక్షుడిగా పటెల్ల రాజు

నందిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా పటెల్ల రాజు ఎన్నికైనారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా అధ్యక్షులు కులచారి దినేష్ పటేల్ రాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పటెల్ల రాజు పార్టీ పటిష్టతకు కృషి చేశారు. అనేక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. జిల్లా, మండల స్థాయి పార్టీ పోస్టులను అనుభవించారు. రాజు నియామకం పట్ల నందిపేట మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ ఏలిగేటి రాజు, గోజూరి నరేందర్, మేక హన్మాండ్లు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ స్టేషన్‌ల జాబితా ఏర్పాటు

మోర్తాడ్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి):మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కొరకు ప్రమేటు పోలింగ్ స్టేషన్‌ల లిస్టును ఎంపీడీవో తిరుమల ఏర్పాటు చేశారు. మండలం లోని పది గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలపై ఎవరికైనా అభ్యంత రాలు ఉంట ఈనెల 13వ తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయంలో తెలపాలని ఎంపీడీవో తెలిపారు.ఈకార్యక్రమంలో సూపరిండెంట్ బ్రహ్మానందం, జూనియర్ అసిస్టెంట్ మోహీజ్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో పేకాట రాయుళ్ల అరెస్టు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 11: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం మధ్యాహ్నం కమ్మర్‌పల్లి ఎస్ఐ అనీల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసలు మెరుపు దాడి జరిపి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గ్రాశావారులో పేకాట అడుతున్న పక్క సమాచారం మెరకు స్థావరం వద్దకు చేరుకుని పేకాట అడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకుని వారివద్ద నుండి 30వేల 630 నగదుతో పాటు 7 సెల్‌ఫోన్‌లు, 4 బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనీల్ రెడ్డి తెలిపారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ ప్రవీణ్, నరేందర్,నాయకులు సురేష్, మోహన్‌రెడ్డి,శ్రీనివాస్, శ్రీకాంత్,రాజగోపాల్ పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడిని ఖండించిన క్రైస్తవ హక్కుల రక్షణ సమితి సభ్యులు

ఆర్మూర్‌టౌన్: ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చిలుకురి బాలాజీ ఆలయ అర్చకుడిపై జరిగిన దాడిని క్రైస్తవ హక్కుల రక్షన సమితి సభ్యులు తీవ్రంగా ఖండించారు. సమాజంలో మతం పేరిట జరిగే ఘర్షణలు మానవ మనుగడకు ప్రమాదమని, మానవత్వానికి మించిన మతం లేదని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణకు మెమో రాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ హక్కుల రక్షణ సమితి ఉమ్మ డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ దైవచిత్తం, పాల్‌జమువా, జీజీరాం, కృపసత్యం, అశోక్, స్యామెల్, ప్రకాష్, ఆగస్టిన్, షడాక్, జాన్ రమేష్, లాజర్, వినోద్, డెవిడ్, రాజు, వీలియం, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కమిషనర్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెండాగల్లీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ మెను ప్రకారం భోజనం పెడుతున్నారా, రుచికరమైన భోజనం అందిస్తున్నారా అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంఒల పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్ వాహనం



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకల్ చంద మియాబాగ్ తండా వద్ద 44వ జాతీయరహదారిపై సోమవారం అర్ధరాత్రి ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చి కంటైనర్ వాహనం ఢీకొన్న ఘటనలో అమృతాపూర్ గ్రామానికి చెందిన సిర్న పల్లి ఒడ్డెన్న(45) అక్కడికక్కడే మృతి చెందగా తేలు రాజేశ్వర్(25) చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్టు ఎస్సై సీహెచ్. తిరుపతిరెడ్డి తెలిపారు.మంగళవారం ఎస్సై సీహెచ్. తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి పశుగ్రాసం కోసం ట్రాక్టర్‌లో సిర్నపల్లి ఒడ్డెన్న, తేలు రాజేశ్వర్, విజయ్‌కుమార్, మరో వ్యక్తి కలిసి ట్రాక్టర్‌పై పశుగ్రాసం జక్రాన్‌పల్లిలో మొక్కజొన్న సొప్పని ట్రాక్టర్‌లో నింపుకొని జక్రాన్‌పల్లి నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్తుండగా చందమియబాగ్‌తాండా వద్ద ట్రాక్టర్‌ను వెనుక ఆర్మూర్ నుంచి గుర్తుతెలి యని కంటైనర్ ఢీకొందని ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంలో సర్నిపల్లి ఒడ్డెన్న, తేలు రాజేశ్వర్‌లు మృతి చెందారని తెలిపారు. ఈ ప్రమాదంలో తాళ్ళ విజయ్‌కుమార్, మరో వ్యక్తికి గాయాలైనట్టు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఒడ్డెన్న భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'యూపీఎస్‌పై యుద్ధభేరి' విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): యూపీఎస్‌పై యుద్ధభేరి విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన యూపీఎస్ విధానానికి వ్యతిరేకంగా మార్చి 2న హైదరాబాద్‌లో ధర్నా చౌక్ వద్ద యుద్ధభేరి కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా తాము వ్యతిరేకి స్తున్నామని అన్నారు. అనంతరంయుద్ధబేరి వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు షాకీర్, మండల అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి కనికరం, అనీల్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మచ్చర్లలో సీఎం దిష్టిబొమ్మ దహనం



మచ్చర్లలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల సంఘం సభ్యులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో మాలసంఘం ఆధ్వర్యంలో మంగళవారం సీఎంరేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాల సంఘం నాయకులు మా ట్లాడుతూ మాలలకు జరిగిన అన్యాయానికి నిరసనగా దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినా దాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

రుద్రూరు,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో నిందితుడికి సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు రుద్రూర్ ఎస్ఐ సాయన్న పేర్కొన్నారు. రుద్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా రుద్రూర్ గ్రామానికి చెందిన షేక్.మహబూబ్(52)అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఆ వ్యక్తిని మంగళవారం బోధన్ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి ఒకరోజు జైలుశిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు.

పరిషత్ ఓటర్లు 6,53,130

● జడ్పీటీసీ స్థానాలు 25 ఎంపీటీసీ స్థానాలు 237 ఖరారు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పరిషత్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. మంగళవారం కామారెడ్డి జిల్లాలో 25 పరిషత్ ఓటర్ల తుదిజాబితాను అధికారులు ప్రచురించారు. జిల్లాలో 25 మండలాలకు 25 జడ్పీటీసీ స్థానాలను, 237 ఎంపీటీసీ స్థానాలను ఖరారుచేశారు. జిల్లాలో మొత్తం ఆయా పరిషత్‌ల పరిధిలో 6,53,130 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. మహిళ ఓటర్లు 338941మంది ఉండగా, పురుష ఓటర్లు 314173 మంది ఉన్నారు. ఇతరులు 16 మంది నమోదయ్యారు. బిచ్కుంద జడ్పీటీసీ స్థాన పరిధిలో అత్యధికంగా 41171 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా మహ్మద్ నగర్‌మండలంలో 14007 మంది ఓటర్లు ఉన్నారు.

జడ్పీటీసీ	ఎంపీటీసీ	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
కామారెడ్డి	6	18734	8847	9887	0
దోమకొండ	9	24414	11503	12911	0
మాచారెడ్డి	7	20168	9683	10484	1
భిక్కనూరు	14	39102	18706	20394	2
రామారెడ్డి	10	27110	12874	14236	0
పల్వంచ	6	17111	8005	9106	0
బీబీపేట	8	20948	10089	10859	0
రాజంపేట	8	22542	10820	11722	0
సదాశివనగర్	12	33092	15882	17210	0
గాంధారి	15	40362	19913	20449	0
తాడ్వాయి	9	26103	12308	13795	0
లింగంపేట	14	38194	18372	19821	1
ఎల్లారెడ్డి	8	20902	9852	11050	0
బాన్సువాడ	11	29628	14197	15429	2
పిట్లం	13	35434	17191	18241	2
నిజాంసాగర్	5	14396	6831	7565	0
మద్నూర్	12	32633	16185	16448	0
బీర్కూర్	7	20228	9540	10688	0
జుక్కల్	14	37168	18492	18676	0
బిచ్కుంద	14	41171	20140	21026	5
డొంగ్లీ	5	14719	7340	7379	0
మహ్మద్‌నగర్	5	14007	6556	7449	2
నాగిరెడ్డిపేట	10	25775	12002	13773	0
నస్రూల్లాబాద్	8	21316	9989	11327	0
పెద్దకొడప్‌గల్	7	17873	8856	9016	1



బాన్సువాడ పట్టణంలోని ప్రధాన రహదారిపై పనిచేయని నిఘా నేత్రాలు

పనిచేయని
నిఘా నేత్రాలు

● బాన్సువాడలో మరమ్మతులకు నోచుకోని సీసీ కెమెరాలు
● నిందితులను పట్టుకోవడంలో పోలీసుల తర్జన భర్జన
● తలనొప్పిగా మారిన చోరీలు, హత్యలు, ప్రమాదాలు
● మరమ్మతులు చేయించాలని పట్టణ ప్రజల డిమాండ్

బాన్సువాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు కొన్నినెలల నుంచి నిద్ర మత్తులో ఉన్నాయి. అవి పని చేయకపోవడంతో పట్టణంలో జరిగిన సంఘటనలు కాని దొంగతనాలు కాని ప్రమాదాలు కాని నిఘా నేత్రాలలో రికార్డు కాకపోవడంతో పోలీసులకు తలనొప్పులుగా మారాయని చెప్పవచ్చు. అంతేకాకుండా పట్టణంలో ప్రతి వార్డుల్లో ప్రధాన రహదారిపై బస్టాండ్ ప్రాంతంలో నిఘా నేత్రాలు ఉన్నప్పటికీ అవి పని చేయకపోవడంతో పట్టణంలో జరిగే ప్రతి సంఘటన హత్యలు, బైకు దొంగతనాల పాల్పడిన నిందితులను పట్టుకోవడంలో విఫలంతో పాటు ఆలస్యంగా లభ్యం కావడంతో పోలీసులు తర్జనభర్జన అవుతున్నారు. గత కొన్ని నెలల క్రితం బాన్సువాడ పట్టణంలోని వారాంతపు సంతలో అక్క తమ్ముడు హత్యలు ఇతర మహిళల హత్యలు బైకు చోరీలు , చోరీల నిందితులను పట్టుకోవడంలో పోలీసులు నిఘా నేత్రాలలో రికార్డు కాకపోవడంతో తలలు పట్టుకున్నారు. ఇదిలా ఉంటే రాత్రి వేళలో పట్టణంలోని ప్రధానరహదారుల గుండా అక్రమ రవాణా వంటి వాహనాలను గుర్తించడంలో కూడా అలసత్వం నెలకొనడం జరిగిందని చెప్పుకోవచ్చు. బాన్సువాడ పట్టణంలో మొత్తం 108 సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఏ ఒక్కటి కూడా పని చేయకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే మరోవైపు నిఘానేత్రాలను మరమ్మతులు చేసిన కొన్ని రోజులకే పనిచేయకపోవడం మరో సమస్య నెలకొంది. గతంలో జరిగిన ప్రమాదాలు కాని చోరీలు గాని ఇతర వ్యాపారస్తుల దుకాణాల సీసీ కెమెరాలు ద్వారా గుర్తించి ప్రమాదాలకు పాల్పడిన నిందితులను పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. మారుమూల వార్డుల్లో రాత్రివేళల జరుగుతున్న సంఘటనలు రికార్డు కాకపోవడంతో ఇతర వ్యక్తుల ద్వారా సమాచారం తెలుసుకుని ప్రమాదాలకు చోరీలకు హత్యలకు గల నిందితులను పట్టుకోవడం జరుగుతుంది. అంతేకాకుండా అనుమానం గా ఉన్న వ్యక్తుల ఫోన్లో ద్వారా నిందితులను పట్టుకున్న సంఘటనలున్నాయి. ఇప్పటికైనా బాన్సువాడ పట్టణంలో 108 నిఘా నేత్రాలను వెంటనే మరమ్మతులు చేయించి పట్టణంలో జరుగుతున్న ప్రమాదాలు, హత్యలు, చోరీలను అరికట్టే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

● ప్రమాదాలు, చోరీలు

బాన్సువాడ పట్టణంలో కొన్ని నెలలుగా జరుగుతున్న ప్రమాదాలు హత్యలు చోరీలకు గల సంఘటనలు పూర్తిస్థాయిలో లభ్యం కాకపోవడంతో నిఘానేత్రాలు మరో వైపు పని చేయకపోవడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. అంతేకాకుండా నిందితులను పట్టుకోవడంలో కూడా పోలీసులకు ఆలస్యం తర్జనభర్జన జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో నెలకొన్న నిఘా నేత్రాలను మరమ్మతు చేయిస్తే పూర్తి సమాచారం వెంటనే పోలీసులకు లభించే అస్కారం ఉంది. అక్రమ రవాణాతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునేలా అవకాశం ఉంటుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

● 108 నిఘా నేత్రాలున్నా పనిచేయని వైనం..

బాన్సువాడ పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు వార్డుల్లో ఇతర సమస్య కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పూర్తిగా పని చేయకపోవడంతో ప్రమాదాలను అరికట్టడంలో విఫలమవుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. బాన్సువాడ పట్టణంలో మొత్తం 108 సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఏ ఒక్క సీసీ కెమెరా పని చేయకపోవడం గమనార్హం. ఇంత పెద్ద మున్సిపాలిటీ పరిధిలో నిఘా నేత్రాలు పని చేయకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు మరమ్మతులు చేయించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● త్వరలోనే అన్ని నిఘా నేత్రాలను మరమ్మతులు చేయిస్తాం



బాన్సువాడ పట్టణంలోని 108 నిఘా నేత్రాలను త్వరలోనే మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకువస్తాం. నిఘా నేత్రాలు పని చేయడం లేదనేది వాస్తవమేనని, మిగతా అన్ని కూడా త్వరలోనే మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకువస్తాం. ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదు.

● మండలి అశోక్, ఎస్‌హెచ్‌వో బాన్సువాడ పట్టణం


మూలన పడిన బర్దిపూర్ లిఫ్ట్

బర్ధీపూర్ లిఫ్ట్ పునర్నిర్మాణంపై
రైతుల గంపెడాశలు


వృథాగా ఉన్న పంపు హౌజ్


సాగునీరు లేక వృథాగా ఉన్న భూములు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 11: బర్దిపూర్ ఎత్తిపోతల పథకం రైతాంగానికి 2వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ లిఫ్ట్ గత పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పూర్తిగా నిరుపయోగంగా మారి మూలనపడింది. కోట్లాది రూపాయలతో రైతాంగానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో నాటి సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఎత్తిపోతల పథకం ఆలనపాలన కరువైంది. ఎత్తిపోతలను నమ్ముకున్న రైతాంగం ఆశలు ఆడియాశాలు కావడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ లిఫ్ట్ ద్వారా బర్దీపూర్, ధర్మారం, కమలాపూర్, ఘన్‌పూర్, మిట్టపల్లి, బీబీపూర్, గ్రామాల రైతుల ఆశలు సన్నగిల్లాయి. లిఫ్ట్ 5ఎంవీ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయి రెండున్నర ఏండ్లు గడిచినా ఇంత వరకు విద్యుత్తుశాఖ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించకపోవడంతో ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. ఎత్తిపోతల పర్యవేక్షణ అధికారులు తమ కేమీ పట్టనట్లు వ్యవహరించడంతో విలువైన మోటార్లు పనిచేయకుండా మూలనపడ్డాయి. ఇప్పటికే దొంగలు ఇనుపగేట్‌లను చోరీ చేయగా మరికొంత మంది ఎత్తిపోతల పథకం వద్ద పేకాట స్థావరంగా మార్చారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలోని పాలకులు స్పందించి లిఫ్టని పునర్ నిర్మాణం చేయాలని, లిఫ్ట్ ద్వారా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ఈ లిఫ్ట్ బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదని, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని లిఫ్టను పునర్ నిర్మాణం చేసి ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో మొదలైన రాజకీయ సందడి

● 'స్థానిక' ఎన్నికలకు సిద్ధమవుతున్న నాయకులు
● ఓటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నంలో నేతలు

తాడ్వాయి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నగర మోగనుందని సంకేతాలు రావడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పల్లెల్లో రాజకీయ సందడి మొదలైంది. త్వరలో రిజర్వేషన్లు కూడా ప్రభుత్వం ప్రకటిస్తుందని తెలియడంతో ఆయా గ్రామాల్లోని గ్రామస్తులనులను మచ్చిక చేసుకునే పనిలో ఆశావాహులు పడ్డారు. వచ్చే నెలలో ఎంపీటీసీ జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికలు ఈ నెలాకరులో లేదా వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం కసరత్తులు ప్రారంభి స్తుంది. ఎన్నికల తేదీలు ప్రకటించినప్పటికీ ఆశా వహులు ముందుగానే గ్రామాల్లో పాగా వేసి ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఇప్పటి నుంచే ఆశావాహులు పోటీలో ఉంటున్నామని ప్రజల కు సంకేతాలు ఇచ్చి ఎన్నికల తేదీ వచ్చేసరికి తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నారు. ఆశా వహులు రిజర్వేషన్లు తమకు వస్తే ఎంత ఖర్చైనా వెనుకాడబోమని చెప్పకనే చెబుతున్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేసి అన్ని స్థానాల్లో కాంగ్రెస్ జెండాను ఎగుర వేయాలని ధీమాతో ఉంది. ఏడాది పాలనలో ప్రభుత్వంపై ప్రజల్లో పెరిగిన వ్యతిరేకతపై స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు విజయం దక్కుతుందని ప్రతిపక్షాలు అంచనా వేస్తున్నాయి. ప్రజావ్యతిరేకత భావాలు తమకు అనుకూలంగా ఉంటాయని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఉన్నాయి. శాసనసభ లోక్‌సభ స్థానాల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధించాలనే ధీమాతో ఉంది. పదేళ్ల తర్వాత అధికారం పోయిన బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి సారిగా వస్తున్న ఈ స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది .ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ జరిపిన పలు సమీక్ష సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఎక్కువశాతం సీట్లు తమ అభ్యర్థులనే గెలిపించుకోవాలని సూచించారు ఇప్పటికే పలుమార్లు టీఆర్ఎస్ నాయకులు జిల్లాల్లో గ్రామాల్లో మండలాల్లో ఉన్న నాయకులతో అంతర్గత సమావేశం నిర్వహించి గ్రామాల్లోని ప్రజల నాడిని తెలుసుకోవాలని అంతర్గత దిశానిర్దేశం చేశారు. టికెట్ల కోసం గ్రామాల్లో అన్ని పార్టీల్లో తీవ్ర పోటీనెలకొంది. పోటీచేసే ఆశావహులు ఎంపీటీసీ సర్పంచ్ జడ్పీటీసీ పోటీలకు బీఆర్ఎస్ బీజేపీ కాంగ్రెస్ నుంచి పెద్దఎత్తున పోటీ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందుగా సర్పంచ్ పోటీలు జరుగుతాయని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ పోటీలు ముందుగా జరిగితే పోటీ చేసే అభ్యర్థులు స్థానిక పోటీలకు దూరంగా ఉండి సర్పంచ్ ఎన్నికల్లో పోటీచేయాలని ఆశావాహులు అనుకుంటున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్లు కేటాయించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. గ్రామాల్లో ఇప్పటికే కులసంఘాల పెద్దలతో సమావేశాలు నిర్వహించి ఆశావాహులు మాట తీసుకుంటున్నారు. ఏది ఏమైనా గ్రామాల్లో ఎన్నికల వేడి మొదలైందని చెప్పుకోవచ్చు.



గ్రామ పంచాయతీ భవనం

రామాలయంలో ఘనంగా గరుడ సేవా

● నేడు రథోత్సవం


రామాలయంలో గరుడ సేవలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో మాగశుద్ధ చతుర్థి మంగళవారం ఆలయ ప్రాంగణంలో గరుడసేవా కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు సుమిత్‌శర్మ దేశ్ పాండే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బలిహరణం, హోమం, హారతి మంత్ర పుష్పం, కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్, ఛైర్మన్ జంగం శాంతయ్య, డైరెక్టర్ నర్సారెడ్డి, పోశెట్టి,మాధురి, జితేందర్, వీడీసీ సభ్యులు సుదర్శన్, యాదగిరి యువజన సభ్యులు పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి సందర్భంగా రథోత్సవం..

మాగశుద్ధ పౌర్ణమి పురష్కరించుకొని బుధవారం రాత్రి ఆలయ నిర్వాహకులు రథోత్సవ కార్యక్రమాలపై ఏర్పాట్లు చేస్తున్నారు. రథోత్సం సందర్భంగా రథప్రతిష్ఠ, హోమం, బలిహరనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. రథోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

బిచ్కుందలో దక్షిణ కాశీ విశ్వనాథ శివాలయం

● వందల ఏళ్లనాటి చరిత్ర కలిగిన ఆలయం

బిచ్కుంద,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బిచ్కుం దలో ఎన్నో ఏళ్ల కిందట ఆనాటి మఠాధిపతులు శివాలయ గుడి నిర్మాణం చేపట్టి గర్భగుడిలో ప్రతిష్టించేందుకు మహా పుణ్యక్షేత్రమైన కాశీనుండి శివలింగాన్ని తెచ్చి ప్రతిష్ఠించడంతో కాశీ విశ్వనాథ శివాలయంగా పేరుగాంచింది. శివలింగ ప్రతిష్ఠాపనతో పాటు గర్భగుడిలోని శివలింగం కనిపించేలా ఎదురుగా భారీ నందిని ప్రతిష్ఠాంచారు. అప్పటి నుండి మహారాష్ట్ర,కర్ణాటక, తెలంగాణ ప్రాంత భక్తుల కోరికలు తీర్చే కాశీ విశ్వనాథుడిగా భక్తుల ప్రగాడ విశ్వాసంతో అభివృద్ధిచెందుతూ ప్రసిద్ది శివాలయంగా వెలుగొందుతుంది. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా మఠాధిపతి నిర్వహకులు సౌకర్యాలను మెరుగుపరుస్తున్నారు. విశ్వనాథ శివుడితో పాటు గణపతి,అన్నపూర్ణమాత,పంచముఖి నాగేంద్రుడి ఆలయాలను భక్తులు దర్శించుకుంటారు. సద్గురు బండయప్ప స్వామి మఠం మఠాధిపతి నిర్వహకులు శివాలయ దర్శనానికి వచ్చే భక్తులకు 365 రోజుల నిత్య అన్నదాన సత్రం కలదు. ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు భారీగా తరలివచ్చే భక్తుల నడుమ మూడురోజుల మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. మహాశివరాత్రి ఉత్సవం కోసం మఠాధిపతి నిర్వహకులు భారీగా సౌకర్యాలు కల్పిస్తారు.


కాశీ నుంచి తీసుకువచ్చి ప్రతిష్టించిన శివలింగం



బిచ్కుంద కాశీనాథ్ శివాలయం


కమ్మర్‌పల్లిలో కొనసాగుతున్న వీర బ్రహ్మేంద్ర స్వామి జాతర ఉత్సవాలు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 11: (ఆంధ్రజ్యోతి) : కమ్మర్‌పల్లి గ్రామ శివారులోని శ్రీగిరి గుట్టపై కొలువుదీరిన కాలజ్ఞాని శ్రీమద్ విరాట్‌పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం, రథోత్సవం, జాతర ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు యజ్ఞం ప్రత్యేక పూజాకార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బధవారం ఆలయ అర్చకులు విశ్వజ్ఞ ఎస్ఆర్ అనిల్ ఆధ్వర్యంలో యజ్ఞ కార్యక్రమం జరుగగా పలువురు దంపతులు పాల్గొన్నారు. నేటి జాతర ఉత్సవాలకు వీడీసీ ఆధ్వర్యంలో ప్రత్యేకపఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రత్యేక పూజలు స్వామివారి యజ్ఞ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు గ్రామస్తులు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు దంపతులు పాల్గొన్నారు. కాగా గుట్టవద్ద గల స్వామి ఉత్స వరథాన్ని మంగళవారం ఊరేగింపుగా స్థానిక లక్ష్మీనరసింహస్వామి అలయం వద్దకు చేర్చారు. జాతర సందర్భంగా రథాన్ని అలంకరించి రథబలి తదితర కార్యక్రమాల అనంతరం బుధవారం సాయంత్రం రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన సిరికొండ విద్యార్థి

సిరికొండ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 13 నుంచి 16 వరకు మహారాష్ట్రలో జరుగనున్న సాఫ్ట్‌బాల్ జాతీయ క్రీడల పోటీలకు సిరికొండ విద్యార్థి వర్షిత్ ఎంపికయ్యారు. జాతీయస్థాయిలో అండర్-14 విభాగంలో జరిగే సాఫ్ట్‌బాల్ క్రీడల పోటీలలో రాష్ట్ర జట్టుకు వర్షిత్ ప్రాతినిథ్యం వహిస్తారని ప్రధానోపాధ్యాయులు నర్సయ్య తెలిపారు. మెదక్‌జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల పోటీలలో వర్షిత్ క్రీడాదనైపుణ్యాన్ని ప్రదర్శించడం వల్ల జాతీయ పోటీలలో పాల్గొనే అవకాశం దక్కిందని నర్సయ్య తెలిపారు. మంగళవారం వర్షిత్‌ను అభినందించి మెమోంటోను అందజేశారు. నర్సయ్య మాట్లాడుతూ క్రీడలలో నిరంతర సాధన చేయడంతో పాటు చదువులో కూడ ముందుండాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్ పాల్గొన్నారు.

సహ చట్టం బోర్డు సరే.. అధికారుల పేర్లు ఎక్కడ?



బోర్డుపై అధికారుల పేర్లు లేని దృశ్యం

బాన్సువాడ,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):ప్రజలకు ఎలాంటి సమాచారాన్ని కావాలన్నా అధికారులు అందించాలన్న సమాచార హక్కు చట్టం 2005ప్రకారం అందించాల్సి ఉంటుంది.అయితే ఈ యాక్టుకు సంబంధించిన బోర్డుల ను ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.ఏర్పాటు చేసిన బోర్డుల్లో అధకారుల పేర్లు తప్పకుండా నమోదు చేయాలి.కాని ఇక్కడ కేవలం సహ చట్టం బోర్డును ఏర్పాటు చేసి అధికారుల పేర్లు నమోదు చేయడంలో మర్చిపోయారు. ఇది బాన్సువాడ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డులో అధికారుల పేర్లు నమోదు చేయలేదు. కేవలం వారి హోదాలను మాత్రమే నమోదు చేశారు. దీంతో దరఖాస్తు కోసం వచ్చిన ప్రజలకు ఏఅధికారికి దరఖాస్తు ఇవ్వాలని తెలియక వెను తిరుగుతున్నారు. ఇప్పటి కైనా సమాచారం హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు నమోదు చేయా లని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి


మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు సురేష్

మాచారెడ్డి,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంగళవారం మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండాలో మండల అధ్యక్షుడు బుస్స సురేష్, పల్వంచ మండలకేంద్రంలో పోసు అనిల్‌లు సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి కార్యకర్త బీజేపీ బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయఅభ్యర్థి మల్కకొమురయ్యను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేలా కృషిచేయాలని అన్నారు. ప్రతి ఓటరును కలిసి అభ్యర్థించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వ్యతిరేక విదానాలు, గత ఎన్నికల సమయంలో ఉద్యోగులు భర్తీచేస్తామని ఇచ్చి మాటతప్పడం, నిరుద్యోగభృతి ఇవ్వకపోవడం వంటి అంశాలను ఓటర్లకు చేరేలా పనిచేయాలని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే ఆలోచన విధానంలో మార్పురావాలి


పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు నాయకులు

తాడ్వాయి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు కావాలంటే విద్యార్థుల దశ నుండే కొత్త ఆలోచన విధానాలను రావాలని మండల విద్యా అధికారి రామస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ డే సందర్భంగా కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెంట్ సహకారంతో డిఆర్‌డిఓ ఇస్రోలలో తయారైన మిసైల్స్ ఆర్యభట్ట బ్రహ్మోస్ చంద్రయాన్ మాంగల్యాన్ శాటిలైట్స్ పాటు వివిధ రకాల పరికరాలను పాఠశాలలో ప్రదర్శించారు ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా డీఆర్డీవో ఇస్రో సెంటర్లను కచ్చితంగా సందర్శించాలని తెలిపారు ఈ సందర్భంగా మండలంలోని సుమారు 1000 మంది విద్యార్థిని విద్యార్థులు పరికరాలను తిలకించారు ఇందులో తాడువాయి మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్యామ్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు, ఉపాధ్యా యులు, విద్యా ర్థులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


కొచ్చెరి మైసమ్మ అమ్మవారు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహా పంక్తి భోజనాలు చేశారు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

కేటీఆర్‌ను కలిసిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

లింగంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలానికి చెందిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంపత్‌గౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధిపై చర్చించినట్లు ఆయన తెలిపారు. పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు కేటీఆర్ సూచించినట్లు తెలిపారు. పార్టీ శ్రేనులు కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని కేటీఆర్ తెలియశారని ఆయన తెలిపారు. ఆయనతో పాటు మాజి ఎమ్మెల్యే జనార్ధన్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజి చైర్మన్ సత్యంరావు, నాగిరెడ్డిపేట మాజి జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు అశోక్‌రెడ్డిలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు కీసరి మైసయ్య

తాడ్వాయి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం మొరం టిప్పర్ కింద ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందారు వివారాలు ఇలా ఉన్నాయి తాడువాయి గ్రామానికి చెందిన కీసరి మైసయ్య 55 నడుచుకుంటూ చిట్యాల రోడ్డుపై వస్తుండగా టిప్పర్ ఢీకొనడంతో మృతి చెందాడు. మృతునికి భార్య సాయవ్వ కుమారుడు చింటూ ఉన్నారు. మృతుడు స్థానిక గ్రామ పంచాయతీలో స్వీపరుగా పనిచేస్తు న్నాడని స్థానికులు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తినాలంటే కిలో మీటర్ నడవాల్సిందే!

● మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం ● ఎండలో కాలినడకన వచ్చి వసతి గృహంలో భోజనం


భోజనం చేయడానికి పాఠశాల నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు


మధ్యాహ్న భోజనం వసతి గృహంలో తింటున్న విద్యార్థులు

ఎల్లారెడ్డి,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయాలంటే కిలోమీటర్ దూరం నడవడం తప్పడం లేదని విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత పదిరోజుల క్రితం ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వికటించి 14మంది అస్వస్థతకు గురైన విషయం విదితమే.ఇట్టి విషయంపై జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఇన్‌చార్జి డీఈవో బలరాం, మధ్యాహ్న భోజనం వికటిం చడం పై విచారణ జరిపి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానో పాధ్యాయులు మాణిక్యంను సస్పెండ్‌చేసి, మధ్యాహ్నభోజన నిర్వా హకులను తొలగించారు. వీరిస్థానంలో కొత్త మధ్యాహ్నం భోజనం నిర్వాహకుల ఏర్పాటు చేస్తామనిఅధికారులు తెలిపారు.సంఘటన జరిగే 10రోజులు అవుతున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల మధ్యాహ్న భోజనం ని ర్వాహకులను ఏర్పాటు చేయకపోవడం వల్ల విద్యా ర్థులు మధ్యాహ్న భోజనం చేయాలంటే వసతిగృహానికి వెళ్లి తిరిగి పాఠశాలకు వెళ్లాలంటే కిలోమీటర్‌దూరం నడవాల్సి వస్తుందని విద్యార్థులు వాపో తున్నారు. అధికారులు స్పం దించి కొత్తఏజెన్సీ నిర్వాహలను ఏర్పాటు చేసి పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని విద్యార్థులు తల్లి దండ్రులు కోరుతున్నారు. ఈవిషయంపై హాస్టల్ వార్డెన్ రాజేశ్వర్ వివ రణ కోరగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులను నియ మించలేదని అధికారుల ఆదేశాలమేరకు వసతి గృహంలోనే మధ్యాహ్న భోజనం కూడా పెడుతున్నామని తెలిపారు.

కరాటే పోటీలలో కాటేపల్లి విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీలలో మండలంలోని కాటేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చేరుకున్న విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. హైద రాబాద్‌లో జరిగిన 4వ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో కాటేపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, రాగి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతు పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటే పోటీలలో సత్తా చాటి పతకాలు సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు. రానున్న రోజుల్లో కరాటే పోటీలలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు ఆటలలో విద్యార్థుల ప్రతిభ చూపినప్పుడే ఆ పాఠశాలకు గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు శివప్రసాద్, పాఠశాల సిబ్బంది యాదవ్, శంకర్, సునీత, లలిత, సుజాత, బక్షిరామ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్లకు స్పందించవద్దు


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మహేందర్

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లు చేసి ఓటిపి నెంబర్లను అడిగితే అటువంటి వ్యక్తుల మాటలకు స్పందించవద్దని పెద్ద కొడప్‌గల్ ఎస్ఐ మహేందర్ బ్యాంకు ఖాతాదారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఆవరణలో సైబర్ నేరాలపై ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్ళు గుర్తు తెలియని అమాయకులకు ఫోన్లు చేసి ఖాతాలలో ఉన్న నగదు అపహరించేందుకు ఓటిపి నెంబర్లను అడిగి వాటి సహాయంతో నగదు స్వాహా చేస్తున్నారని తెలిపారు. అంతేగాక మీ నెంబర్‌కు బహుమతు వచ్చాయని బురిడి కొట్టించడం కూడ ఇటీవలి కాలంలో సర్వసాదారమైందని, అటువంటి వారి మాటలు నమ్మవద్దని హితువు పలికారు. దీంతో పాటుగానే బ్యాంక్ నుండి మాట్లాడుతున్నామని నమ్మిస్తుంటారని, బ్యాంకు అధికారులు ఎవరూ ఫోన్లలో సమాచారం అడగరని అటువంటి మాటలు కూడ నమ్మరాదని తెలిపారు. వీటితో పాటుగానే ఇటీవలి కాలంలో ముంబయి నుండి సైబర్ క్రైం అధికారులమంటూ వీడియో కాల్ చేసి మోసం చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అటువంటి వాటిని నమ్మవద్దని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ గోపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దొంగలు

● కేబుల్ వైర్లు, పైపులు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో ఇబ్బందులు పడుతున్న రైతులు


పెద్దమల్లారెడ్డిలో స్టార్టర్ డబ్బాలను ధ్వంసం చేసిన దృశ్యం (ఫైల్)

భిక్కనూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో భూగర్భజలాలు తగ్గి వ్యవసాయ బోర్లు పోయని పరిస్థితి మొదలై రైతులు ఇబ్బందులు పడుతుండగా మరోవైపు వ్యవసాయ బావుల వద్ద మోటర్లకు బిగించిన కేబుల్ వైర్లను, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్తూ రైతులకు, పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. భిక్కనూరు మండలంలో గత సంవత్సరం సైతం ఇదే సీజన్‌లో ఇలాంటి ఘటనలు జరుగగా ఈ సంవ త్సరం సైతం ఇదే సీజన్‌లో ఇలాంటి వరుస దొంగతనాలు జరుగుతు న్నాయి. ఈ దొంగతనాలు జరగకుండా వ్యవసాయబావుల వద్దనే రైతులు నిద్రిస్తున్న రైతన్నల కళ్లుకప్పి చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడుతూ అందినకాడికి దోచుకెళ్తున్నారు.

● వరుస దొంగతనాలతో రైతుల ఇబ్బందులు

గత కొన్నిరోజులుగా ఉమ్మడి భిక్కనూరు మండలంలో ముఖ్యంగా జంగంపల్లితో పాటుగా రాజంపేట మండలంలోని ఆరేపల్లి, శివాయిపల్లి గ్రామాలలో వ్యవసాయబావుల వద్ద కేబుల్‌వైర్లు, స్టార్టర్లు, పైపులు, వ్యవసాయ పనిముట్లతో పాటుగా ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి ఆయిల్‌ను ఎత్తుకెళ్తున్నారు. ఈవరుస దొంగతనాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల భిక్కనూరు మండలం లోని జంగంపల్లి గ్రామంలో,రాజంపేట మండల గ్రామాల్లో దాదాపుగా 20 వ్యవసాయ బావుల వద్ద వ్యవసాయబావుల వద్ద మోటర్ల నుండి కేబుల్ వైర్లను కత్తిరించి అక్కడే ఆ వైరును కాల్చిఅందులోని కాపర్‌ను ఎత్తుకెళ్లారు. మరికొన్ని గ్రామాల్లో స్టార్టర్ డబ్బాలు, పైపులు, స్టార్టర్లను ఎత్తుకెళ్లారు.ధ్వంసం కావడంతో వాటి స్థానంలో కొత్త స్టార్టర్ లను ఎత్తుకెళ్లారు. మరికొన్ని గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్‌ను ఎత్తుకెళ్లారు.ఈకేబుల్‌వైర్లు చోరీ కావడంతో వరిపంట, మొక్కజొన్న, కూరగాయపంటల సాగుకు నీరం దక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నిసార్లు వ్యవసాయ బావుల వద్ద కాపాల కాసిన రైతుల కళ్లుకప్పి దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు.

● దొరికినట్టే దొరికి తప్పించుకుంటున్నారు

భిక్కనూరు, రాజంపేట మండలాల్లో వ్యవసాయబావుల వద్ద కేబుల్ వైర్లను, స్టార్టర్‌లను ఎత్తుకెళ్తున్న దొంగలను పట్టుకోవడానికి రైతులు రాత్రి సమయాల్లో కాపాలా కాస్తున్నా ఫలితం లేకపోతుంది. ఒక్కోసారి దొరికినట్టే దొరికి రైతులను పసిగట్టి తప్పించుకున్న సంఘటనలు ఉన్నాయి. రాత్రి సమయాల్లో రైతులు మొక్కజొన్న పంటల వద్ద గత కొన్ని రోజులుగా కాపాల కాస్తున్నారు. కానీ వారు ఎప్పుడొస్తున్నారో తెలియదు కానీ రైతుల కళ్లుగప్పి యదేచ్ఛగా దొంగతనాలకు పాల్పడు తున్నారు. రైతులు ఈ దొంగతనాలపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.

● పాత ఇనుప సామాను దుకాణాలపై నిఘా

రైతుల కళ్లు గప్పి కేబుల్ వైర్లను, స్టార్టర్ డబ్బాలను, పైపులను ఎత్తుకెళ్తున్న దొంగలు కామారెడ్డితో పాటుగా చుట్టూ గ్రామాల్లో ఉన్న పాత ఇనుప సామాను దుకాణాల్లో ఏమైనా విక్రయిస్తున్నారా అన్న అనుమానంతో కొందరు రైతులు ఆ దుకాణాల వద్ద నిఘా పెట్టారు. ఆ దుకాణాలకు వచ్చి పైపులు, ఇతరిత వ్యవసాయ పనిముట్లను విక్రయిస్తున్నారో వారిని పట్టుకుని అవి ఎక్కడి నుండి తీసుకువచ్చారో అని ఆరా తీస్తున్నారు. దుకాణాల యాజమానులకు సైతం ఏమైనా వ్యవసాయ పనిముట్లు, పైపులు, కెబుల్ వైరును ఎవరైనా తీసుకువస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

● దొంగలను పట్టుకోవాలని రైతుల వేడుకోలు

వ్యవసాయ పనిముట్లు, కేబుల్ వైర్ల దొంగతనంతో తాము నష్టపోవడమే కాకుండా పంటలు సైతం నష్టపోయే పరిస్థితి నెలకొంటుందని, గతంలో సైతం ఇలాంటి దొంగతనాలు ఉమ్మడి భిక్కనూరు మండలంలో జరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం వ్యవసాయ బావుల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్న వారిని కొందరి రైతులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటనలు ఉన్నాయి. తమకు నిద్రపట్టకుండా చేస్తూ ఇంతగా నష్టపరుస్తున్న దొంగలను పోలీసులు పట్టుకుని కఠినంగా శిక్షించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

అర్చకుడిపై చేసిన దాడిని ఖండిస్తున్నాం : సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):రామ రాజ్యం ముసుగులో చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై చేసిన దాడిని ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు.మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసినసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధిగాంచిన చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు లౌకికవాది, ప్రజాస్వామ్యవాదిఅని మతోన్మాదులు దాడిచేయడం సభ్యసమాజం తలదించుకునే చర్యగా ఉందన్నారు. దాడి చేసిన వారిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టుపెట్టి మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలని పూజారులపై ఇటువంటి దాడులు మళ్లీ జరగకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నర్సింలు,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ ఫుల్ డిమాండ్!

(ఐదోపేజీ తరువాయి)

పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లపై లోడ్ పడుతుండడంతో పలుచోట్ల కాలిపోతున్నాయి. నివారించేందుకు అధికా రులు చర్యలు చేపడుతున్నారు.

● గృహ, కమర్షియల్ అవసరాలకు ఎక్కువే

జిల్లాలో విద్యుత్ డిమాండ్ క్రమంగా పెరుగుతుంది. చలితీవ్రత తగ్గడంతో జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పంటల సాగుకే కాకుండా గృహావసరాలు, పరిశ్రమలకు విద్యుత్ వినియోగం ఎక్కువే అవుతోంది. వేసవికి ముందే ఎండల ప్రభావం చూపిస్తున్నాయి. వారం రోజులుగా మధ్యాహ్నం ఉక్కపోతలు అధికమవుతున్నాయి. ఇళ్లలో ఫ్యాన్‌లు గిరగిరా తిరుగుతున్నాయి. గత ఏడాది ఫిబ్రవరి నెలలో 4.9 మిలియన్ల విద్యుత్ వినియోగం కాగా ప్రస్తుతం 5.8 మిలియన్ల విద్యుత్ వినియోగమైంది. దీంతో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరిగినట్లు తెలుస్తోంది.

మంజీరా కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా!

(ఐదోపేజీ తరువాయి)

ఇసుక అవసరం ఉంటుంది. దీంతో ఇసుక బంగారంలా మారింది. అభివృద్ధి పనుల పేరు చెప్పి తీసుకవస్తున్న ఇసుక ఈ నిర్మాణాల దగ్గరికి చేరుతుంది. ఒక్కో ట్రాక్టర్‌కు మూడు వేల నుంచి మూడువేల అయిదు వందల ధర వరకు విక్రయిస్తు రెండు చేతుల సంపాదించుకుంటున్నారు. ఇందులో నుంచి అధికారులకు సైతం కొంత మేర డబ్బులు పక్కకు తీసి అందజేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● బీర్కూర్‌లో మితిమీరుతున్న మినీ ఇసుక మాఫియా ఆగడాలు.

బీర్కూర్ మండల కేంద్రంలో ఓ మినీ ఇసుక మాఫియా తయారైంది. వారి పని బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలాల్లో ఎవ్వరెవ్వరికి ఇసుక అవసరం ఉందో తెలుసుకుని వారికి ఇసుకను సరఫరా చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట వే బిల్లులు పొంది ట్రాక్టర్‌లలో ఇసుకను అభివృద్ధి పనుల జరిగే చోటుకి కాకుండా ప్రైవేటు నిర్మాణాల వద్దకు తరలిస్తు సోమ్ము చేసుకుంటున్నారు. బీర్కూర్‌లో కొంత మంది యూనియన్‌గా ఏర్పడి ఇసుకదందాకు శ్రీకారం చుట్టారు.తమట్రాక్టర్లు తప్పా ఇతర గ్రామాల ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేయకుండా అడ్డుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేపడుతున్న కాంట్రా క్టర్లు తమకు ఇసుక అవసరం ఉంటే ఈ మినీ మాఫియాను కలిసి ఇసుకను తరలించుకుంటున్నారు. వేరే గ్రామాల నుంచి ట్రాక్టర్ లను తీసుకవస్తే వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, పోలీస్ అదికారులు చూసిచూడనట్లు వ్యవహారిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

● మండల ప్రత్యేక అధికారి దయానంద్


దుర్కిపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దయానంద్

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యా యులు అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. మంగళవారం నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలతో పాటు ఉర్దూ మీడియం స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అంది స్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ చిన్నారులకు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. అదే విధంగా గ్రామంలోని మురికి కాలువలు, విధులను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ సెక్రెటరీ సరితకి ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి వెంట ఉపాధి హామీ ఎపిఓ సౌజన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయులు, తదితరులు ఉన్నారు.

తల్లి మందలించడంతో కూతురు ఆత్మహత్య

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీలో నివాసం ఉండే మెరికాడి సంజన(15) అనే బాలిక ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. మంగళవారం ఆమె తల్లిదండ్రులు పనికి వెళ్లగా చీరతో బెడ్‌రూంలో ఉరివేసుకుని చనిపోయిందని తెలిపారు. ప్రస్తుతం సంజన 10 వ తరగతి చదువుతుండగా గత 10 రోజులుగా పాఠశాలకు వెళ్లకపోవడంతో పాటు సరిగ్గా చదవడం లేదని ఆమెను మంచిగా చదువుకోవాలని తల్లి లక్ష్మీ మందలించిందని తెలిపారు. దీంతో తనకు సరిగ్గా చదవడం రావడం లేదని బాధపడుతూ జీవితంపై విరక్తిచెంది ఎవరు లేని సమయం చూసి ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

లింగంపల్లిలో ఉచిత పశువైద్యశిబిరం

సదాశివనగర్,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలం లింగంపల్లిలో మంగళవారం ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు పశువైద్యాధికారి రాంప్రసాద్ తెలిపారు. గేదెలు ఏవైన ఎదకురాని ఉంటే పరిక్షించి గర్భకోశ వ్యాధులకు తగిన చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. లింగనిర్ధారిత వీర్యం వాడడం వలన 90శాతం ఆడదూడలు మాత్రమే జన్మిస్తాయని తెలిపారు. దీనికిగాను రైతువాటా రూ.250 చెల్లించాలని ఒకే పశువుకు వరుసగా రెండు ఎదలలో లింగనిర్ధారిత వీర్యం వాడినచాలు కట్టకపోతే రైతవాటా రూ. 500లు రైతు అకౌంట్‌కు వాపస్ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ శిబిరంలో దా దాపు 54 గేదెలు, 12 ఆవులకు చికిత్స చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం లో డీఎల్‌డీఏ మాజీద్,సూపర్‌వైజర్‌కృష్ణ, విజయపాలకేంద్రం అధ్యక్షుడు కిషన్‌రావు, సెక్రటరీ ప్రసాద్, గోపాలమిత్రలు కాశిరెడ్డి,మురళి తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు వెళ్లిన
ఎల్లారెడ్డి వాసి మృతి


మంగలి శంకర్ (ఫైల్)

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో విషాదం చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన ఒకరు అస్వస్థ తకుగురై మరణించారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మంగలి శంకర్ (43) కుంభమేళాకు వెళ్లి అక్కడ అస్వస్థతకు గురి కాగా, అతడిని ఆలహా బాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిం చినా స్పందించక పోవడంతో వెంటిలేటర్ వాహనంలో సోమవారం హైదరాబాద్‌కు తరలి స్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- పట్టుదల
దర్శన్	- పుష్ప-2
ప్రియా 70	- ఒక పథకం ప్రకారం
ప్రియా 35	- తండేల్

బాన్సువాడ

మహేశ్వరి	- సంక్రాంతికి వస్తున్నాం
వెంకటేశ్వర	- డాకు మహారాజ్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	180	210

